క్లుప్తంగా

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఫెయిత్‌హోంలో డాక్టర్ పి.డానియేల్ ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం ఒకేషనల్ గైడెన్స్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరై మాట్లాడారు. ఉపాధి అవకాశాలపై ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలూరు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్, వృత్తి విద్యా నిపుణులు సుమంత్, నోబుల్ ఒకేషనల్ కాలేజీ కరస్పాండెంట్ దేవదానం, కర్నూలు స్ప్రింగ్ స్కిల్ ట్రైనింగ్ ఫౌండేషన్ ప్రతినిధి సుశాంత్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఆదోని అర్బన్: పట్టణంలోని మేదర్‌గేరిలో అయ్యన్న అనే వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, అతని వద్ద ఉన్న 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా మద్యం పట్టుబడిందని వన్‌టౌన్ సీఐ విక్రమసింహ తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా పోరాడుదాం


పెద్దకడబూరులో మాట్లాడుతున్న నాయకులు

పెద్దకడబూరు/కౌతాళం: కర్నూలు పశ్చిమ ప్రాంతంలో ఉన్న కరువు, వలసలు ఆగాలంటే రాజకీయాలకు అతీతంగా కలిసి కట్టుగా ఉద్యమించి ప్రాజెక్టులను సాధించుకోవాలని ఆర్‌సీసీ పొలిటికల్ ఆర్గనైజర్ రాజన్న, ఏఏడీఏ కన్వీనర్ ఆదినారాయణ, అరుణోదయ రెండు రాష్ట్రాల చైర్మన్ విమలక్క సూచించారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, భాగస్వామ్య సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాయలసీమ వలస కార్మికుల చైతన్య యాత్ర మంగళవారం పెద్దకడబూరు, కౌతాళం మండలాల్లో పర్యటించింది. ఆయా మండల కేంద్రాల్లో వారు మాట్లాడుతూ రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందన్నారు. ఈ ప్రాంతంలో వలసలు, కరువు ఉన్నాయని, సాగునీటి ప్రాజెక్టుల కోసం ఉద్యమించాల్సిన అవసరముందని చెప్పారు. ఇదే విషయమై కర్నూలు పశ్చిమ ప్రాంత ప్రజలను చైతన్య పరచడానికే యాత్ర చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌సీసీ నాయకులు రవివర్మ, శాంతరాజు, పీఓడబ్ల్యూ స్త్రీ విముక్తి నాయకులు సుజ్ఞానమ్మ, మణిరత్నం, ఏఐఎఫ్‌టీయూ నాయకులు గంగన్న, హుసేని, బాషా పాల్గొన్నారు.

యూపీఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న యూపీఎస్ఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్ ఫెడరేషన్(యూపీఎస్ఎఫ్) డివిజన్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యూపీఎస్ఎఫ్ రాష్ట్ర, రాయలసీమ, జిల్లా అధ్యక్షులు వి.సుదర్శన్, చంద్రశేఖర్, క్రిష్టోఫర్ హాజరై నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వి.సుదర్శన్ మాట్లాడుతూ బడ్జెట్ స్కూళ్లకు అండగా యూపీఎస్ఎఫ్ ఉంటుందన్నారు. రాయలసీమ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ స్కూళ్లకు ఉన్న మూడేళ్ల పర్మిషన్‌ను 8 ఏళ్లకు పెంచాలన్నారు. అనంతరం ఆదోని డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా జి.రామకృష్ణ, జనరల్ సెక్రటరీ ఆర్.కునాల్, కోశాధికారి సెల్వన్న, ఆలూరు నియోజకవర్గ కన్వీనర్ నరేష్ ఆచారి, కౌతాళం మండల కన్వీనర్ వై.వి.రఘురామ్, హొళగుంద మండల కన్వీనర్ షేక్షావలిలను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కబుల, చాంద్, చిరంజీవి పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ రైతు బొడ్డన్నకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. నాలుగు రోజుల క్రితం పశువుల కోసం రూ.90 వేలకు పశుగ్రాసం కొనుగోలు చేసి వామి వేసుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం గడ్డివాముకు నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు రైతుకు, ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసేలోపు పశుగ్రాసం మొత్తం కాలిపోయిందని రైతు వాపోయాడు.

25న మండల సర్వసభ్య సమావేశం

ఆదోని రూరల్: ఈనెల 25న స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ బడాయి దానమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

రైతన్న కలల సాకారం దిశగా..

- రూ.74.14 కోట్లతో 6 ఎత్తిపోతల పథకాల పనులు
- ఆయకట్టుగా మారనున్న 8,145 ఎకరాల బీడు భూములు
- 50 శాతం పనులు పూర్తి


ఐరన్‌గల్లులో సాగుతున్న పైపులైన్ పనులు,


ఐరన్ పథకం పంపుహౌస్ పనులు

మంత్రాలయం: వరద నీటిని ఒడిసి పట్టి మెట్టకు జీవం పోసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తుంగభద్ర జబీ జలాలతో ఎత్తిపోతల పథకాల నిర్మాణాలకు పురుడు పోసింది. కరవు నేలలో సిరులు పండించుకునేందుకు బాసటగా నిలిచింది. మెట్టను ఆయకట్టుగా మార్చి రైతన్నల కలలను సాకారం చేసేందుకు 6 ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసింది. నిర్మాణ పనులు వడివడిగా సాగుతుండటంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా పనులు

రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలో మొత్తం 6 ఎత్తిపోతల పథకాలకు గానూ రూ.74.14 కోట్లు మంజూరు చేసింది. మంత్రాలయం మండలం ఖగ్గల్, 52-బసాపురం, కోసిగి మండలం ఐరన్‌గల్, కౌతాళం మండలం గోతులదొడ్డి, కోసిగి ఎత్తిపోతల పనులు ప్రారంభమయ్యాయి. సాతనూరు పనులు త్వరలోనే మొదలు పెట్టనున్నారు. ఖగ్గల్ పథకం పనులు ఇప్పటికే 60 శాతం పనులు చేపట్టారు. 4.5 కిలోమీటర్ల మేర పైపులైను పనులు పూర్తయ్యాయి. బసాపురం 4 కి.మీ., గోతులదొడ్డి 8.5 కి.మీ., కోసిగి 4.5 కి.మీ. ఐరన్‌గల్ 7.5 కి.మీ. మేర పనులు చేయాల్సి ఉండగా 50 శాతం పనులు పూర్తి చేశారు. బసాపురం, ఐరన్‌గల్, ఖగ్గల్ ఎత్తిపోతల పంపుహౌస్ నిర్మాణాలు 80 శాతం ముగించారు.

రైతన్న హర్షం

నది చెంతనే ఉన్నా ఎన్నో ఏళ్లగా తీర గ్రామాల రైతులు వర్షాధారంపైనే పంటలు పండించుకునే పరిస్థితి. గత ప్రభుత్వాలు ఏనాడూ రైతన్న ఇబ్బందులను గుర్తించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రైతన్నలకు మేలు చేయాలని తలచారు. ముఖ్యమంత్రితో సంప్రదించి 6 ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయించుకున్నారు. అలాగే పులికనుమ ప్రాజెక్టు రిజర్వాయర్ కోసం కోసిగి రైతులు విలువైన భూములు కోల్పోయారు. కోసిగి రైతులు ఏళ్లగా తమకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యే రూ.5.38 కోట్లు మంజూరు చేయించి ఎత్తిపోతల పథకంతోపాటు, మండల కేంద్రం ప్రజల తాగునీటి కోసం ఎస్ఎస్ ట్యాంకు పనులు శ్రీకారం చుట్టారు. పథకాలు మంజూరుతో పాటు పనులు సైతం చకచకా పూర్తి చేస్తుండటంతో రైతుల హర్షం వెలిబుచ్చుతున్నారు.

మండలం	పథకం	నిధులు రూ..	ఆయకట్టు (ఎకరాలలో)
మంత్రాలయం	52-బసాపురం	10.42 కోట్లు	1,455
మంత్రాలయం	ఖగ్గల్	6.90 కోట్లు	495
కోసిగి	ఐరన్‌గల్	18.52 కోట్లు	1,515
కోసిగి	కందకూరు	11.95 కోట్లు	1,170
కోసిగి	కోసిగి	5.00 కోట్లు	1,500
కౌతాళం	గోతులదొడ్డి	21.25 కోట్లు	2,010
మొత్తం		74.14 కోట్లు	8,145 ఎకరాలు

కల నెరవేరబోతోంది



పులికనుమ జలాశయం నిర్మాణంలో నాతోటి రైతులు ఎందరో వందలాది ఎకరాలు కోల్పోయారు. కోసిగి రైతులకు రిజర్వాయర్ నుంచి ఎలాంటి సాగునీరు అందేది కాదు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మా కష్టాలను గుర్తించి ఎత్తిపోతల పథకం మంజూరు చేయడం సంతోషంగా ఉంది. పనులు కూడా వేగంగా చేస్తున్నారు. రెండు, మూడు నెలల్లో మా కల సాకారం కాబోతోంది.
– నాగిరెడ్డి, రైతు, కోసిగి

సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి



నియోజకవర్గంలో అత్యధికంగా వర్షధార భూములు ఉన్నాయి. ప్రస్తుతం ఎల్ఎల్‌సీ, గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకాల ద్వారా మాత్రమే సాగునీరు అందుతోంది. ఈ ప్రాజెక్ట్‌ల గ్యాప్ మెట్టభూములను దృష్టిలో ఉంచుకుని కొత్తగా 6 ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయించుకున్నాం. ఈపథకాల ద్వారా దాదాపు 10 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నాం. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేసి సాగునీరు అందజేసేందుకు కృషి చేస్తాం. ఆర్డీఎస్ కుడిగట్టు కాల్వ నిర్మాణ పనులు కూడా పూర్తి చేసేందుకు త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సంప్రదింపులు చేయనున్నాం. రైతులకు సాగునీటి ఇక్కట్లు రాకుండా శతవిధాలా ప్రయత్నం చేస్తాం.
– వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే, మంత్రాలయం

ఈరోజు

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కౌతాళం: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మొదటి ఏడాది విద్యార్థులు 79 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 60 మంది పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

- కోసిగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి 30వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల పరీక్షల చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 283 మంది, సెకండియర్‌లో 232 మంది, ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం ఏడుగురు, ద్వితీయ సంవత్సరం 8 మంది పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. మొదటి సంవత్సరం వారికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

నేటి నుంచి వలంటీర్లకు సన్మానం

ఆదోని రూరల్: అవార్డులకు ఎంపికైన వలంటీర్లను నేటి నుంచి దశలవారీగా సన్మానించనున్నట్లు ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బుధవారం ఆరేకల్, బల్లేకల్, బసాపురం, బైచిగేరి, చిన్నహరివాణం, చిన్నపెండేకల్, ఢణాపురం, దిబ్బనకల్, దొడ్డనగేరి, గణేకల్, జి.హొసళ్లి, హానవాళ్, ఇస్వీ, జాలిమంచి, కపటి, కుప్పగల్, మదిరె-1, 2, మండిగిరి-1, 2 సచివాలయాల వలంటీర్లను, 26న మాంత్రికి, నాగలాపురం, నాగనాథనహళ్లి, నారాయణపురం, పెద్దహరివాణం-1, 2, పెసలబండ, సాదాపురం, సాంబగల్, సంతెకూడ్లూరు-1, 2, విరుపాపురం, పెద్దతుంబళం-1, 2 సచివాలయాల వలంటీర్లను సన్మానించనున్నట్లు తెలిపారు. వలంటీర్ల సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు.

ప్రజల సేవలో పౌరసరఫరాల శాఖ


ఐరిస్ డివైస్‌లను అందజేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: ప్రజలకు మరింత చేరువలో పౌరసరఫరాలశాఖ సేవలందిస్తుందని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రేషన్ వాహనదారుల ఆపరేటర్లకు 'ఐరిస్ డివైస్'లను సబ్‌కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు బియ్యం పంపిణీ చేసే విషయంలో బయోమెట్రిక్ వేసి పంపిణీ చేసే కార్యక్రమం ఉంటుందన్నారు. సాంకేతిక సమస్యలు అధిగమించేందుకు ప్రభుత్వం ఐరిస్ డివైస్‌తో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పార. ఆదోని డివిజన్‌లోనే 163 రేషన్ వాహనదారుల ఆపరేటర్లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల ఉప తహసీల్దార్ వలీబాషా ఉన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణ రెడ్డి

కోసిగి: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని డీఎల్‌డీఓ, జిల్లా సచివాలయాల ఇన్‌చార్జ్ బాలకృష్ణ రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ అయ్యమ్మ, తహసీల్దార్ రుద్రగౌడ, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు, మహిళా పోలీసులు, పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లవాడికి 21 ఏళ్లు పూర్తి అయిన తర్వాతే వివాహం చేయాలన్నారు. ప్రభుత్వం విద్య కోసం ఎంతో ఖర్చు చేస్తోందని, ఆడ, మగ పిల్లలు అనే తేడా లేకుండా అందరినీ చదివించుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు.

కౌతాళం: బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ అక్షరాస్యత తక్కువ ఉన్న మండలం కావడంతో బాల్యవివాహాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. పొదుపు మహిళలు ప్రజలకు అవగాహన కల్పించి వీటిని అరికట్టాలన్నారు. సమావేశంలో ఏపీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో విద్యుత్ కోతలు లేవు

- సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న

ఆదోని టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విద్యుత్ కోతలు లేవని, జనరేటర్ నుంచి ఆక్సిజన్ ప్లాంట్‌లకు అదనంగా కేబుల్ కనెక్షన్ల కోసం విద్యుత్ సరఫరాను నిలిపేశామని సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోగులకు అనుగుణంగా పిల్లలు, స్త్రీలు, పురుషుల వార్డుల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. విద్యుత్ కోతలతో రోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఓ పత్రిక(సాక్షి కాదు) ప్రచురించిన వార్తలో వాస్తవం లేదన్నారు. 250 కేవీ జనరేటర్ నుంచి రెండు ఆక్సిజన్ ప్లాంట్లకు సంబంధించి కేబుల్ కనెక్షన్ల కోసం సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గంట మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపేసి పనులు చేయించామన్నారు. జనరేటర్‌కు సంబంధించి డీజిల్ కొరత ఉన్నట్లు వార్తలో ఆరోపించారని, అందులోనూ వాస్తవం లేదన్నారు. డీజిల్ కోసం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధులు లేదా ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన నిధులను వినియోగిస్తున్నామన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో దాదాపు రూ.4 లక్షలకు పైగానే నిధులు ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో నీటి సమస్య లేదన్నారు. స్త్రీ, పురుషులు, చిన్నపిల్లల వార్డుల్లో బాత్‌రూమ్, లెట్రిన్‌ల మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. భవిష్యత్‌లో నీటి సమస్య ఏర్పడే అవకాశం లేకపోలేదని, దీంతో అదనంగా మరో బోరును ఏర్పాటు చేసేందుకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో ప్రతిపాదనలు పెట్టామన్నారు.

చూడిలో కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కౌతాళం: మండల పరిధిలోని చూడి గ్రామంలో కర్నూలు అమీలియా ఆసుపత్రి వైద్యులు మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 60 మందికి వైద్య పరీక్షలు చేయగా 38 మందికి ఆపరేషన్లు అవసరం కావడంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో కంటి ఆపరేషన్లు చేయిస్తామని వైద్యుడు ఈరన్న తెలిపారు. మిగతా వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, బాషా పాల్గొన్నారు.

'ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి'

ఆదోని అర్బన్: తన భర్త నుంచి ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని కౌతాళం మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన మహాదేవమ్మ కుమార్తె మహేశ్వరి కోరింది. మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో మహేశ్వరి విలేకరులతో మాట్లాడారు. చిరుతపల్లి గ్రామానికి చెందిన చిన్ననరసింహులు(బెంగళూరులో సాఫ్ట్‌వేర్)తో తనకు రెండేళ్ల క్రితం వివాహమైందని, కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో ఇల్లు బాడుగకు తీసుకుని ఉంటున్నామని, భర్త వర్క్ ఫ్రం హోం చేసుకుంటున్నాడని తెలిపింది. పెళ్లికి ముందు వేరే అమ్మాయితో అక్రమ సంబంధం ఉందని తెలిసి నిలదీయడంతో రోజూ చిత్రహింసలు పెడుతున్నాడని, ఈ విషయంలో పెద్దలు, పోలీసుల సమక్షంలో రాజీ చేశారని, అయినా అతనిలో మార్పు లేదని ఆరోపించింది. సోమవారం గొడవ పడడంతో తన తల్లి మహాదేవమ్మ, సోదరులు శంకర్, మహాదేవ్ ఉరుకుందకు వచ్చి తనను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా తన భర్త చిన్ననరసింహులుతోపాటు అతని బంధువులు దాడి చేసి గాయపరచడంతో ఆస్పత్రికి చికిత్స పొందుతున్నాట్లు చెప్పింది. కాగా ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె భర్త చిన్ననరసింహులు మాట్లాడుతూ తనపై తన భార్యకు అనుమానం ఎక్కువని, మానసికంగా వేధిస్తోందని, చిన్నచిన్న సమస్యలకు కూడా గొడవ పడుతోందని వాపోయాడు. సోమవారం రాత్రి భార్య సోదరులు శంకర్, మహాదేవ దాడి చేసి తనను గాయపరచడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసును కౌతాళం స్టేషన్‌కు బదిలీ చేస్తామని అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపారు.

లోకేష్ పాదయాత్రకు అర్థమే లేదు

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: టీడీపీ నేత లోకేష్ యువగళం పాదయాత్రకు అర్థమే లేదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆరోపించారు. మంగళవారం మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామ సచివాలయం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. కేవలం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై తప్పుడు ఆరోపణలు చేయడం తప్ప ఓ అజెండా అంటూ లేదని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే చేయబోయే పనుల మేనిఫెస్టో లేకుండానే యాత్ర సాగిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పాదయాత్రలతో ఒరిగేది శూన్యమన్నారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలు అందరికీ తెలుసునని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. చంద్రబాబుతో పార్టీలన్నీ ఏకమైనా జగనన్న సింహంలా సింగిల్‌గా పోటీ చేస్తారన్నారు.

గడప గడపతో సమస్యల పరిష్కారం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పల్లెల్లో సమస్యలు పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల బాధలు తెలుసుకోవడం జరుగుతోందన్నారు. ఒక పేదోడికి సంక్షేమ పథకాలు అందేలా చూసేందుకు ఈ కార్యక్రమంలో దోహదపడుతుందన్నారు. మాలపల్లి సచివాలయం పరిధిలోని సింగరాజనహళ్లి, సుంకేసుల గ్రామాల్లో రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. పులికనుమ ప్రాజెక్ట్ నుంచి పంట పొలాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. బసలదొడ్డి రిజర్వాయర్ పంప్‌హౌస్‌కు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి లోఓల్టేజ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను శాలువా, ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భీంరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్‌లు రాధారెడ్డి, సీతారామిరెడ్డి, ముక్కరన్న, మండల నాయకులు గురురాజరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ప్రభావతి, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, పంచాయతీ రాజ్ డీఈ అశ్వర్థామ, ఏఈ నరసింహులు, ఏపీఎం జయశ్రీ, ఏపీఓ తిమ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఇర్షాద్‌బాషా, స్వామినాథ్ పాల్గొన్నారు.

నేడు బాస్కెట్ బాల్ టోర్నీ ప్రారంభం

కోసిగి: మండల కేంద్రంలోని మౌంట్‌కార్మెల్ పాఠశాలలో బుధవారం డివిజన్ స్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్స్ శ్రీధర్, వంశీ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9160673702, 6304617237 సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి నదిచాగిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో ఈనెల 25 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్ శేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి, సమస్యలను తెలుసుకోనున్నారన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్దకడబూరు: మండల కేంద్రంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రంలో క్వింటా మొక్క జొన్నలను రూ.1,962 మద్దతు ధరతో విక్రయించుకోవాలన్నారు. మొదటి రోజున అధికారం 350 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎస్ఆర్‌టీసీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రవిచంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

జిరాక్స్ సెంటర్లపై ఆంక్షలు

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల ఉండే ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసి వేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేర్లు నమోదు చేసుకోండి


రైతు వివరాలను నమోదు చేసుకుంటున్న వ్యవసాయ సిబ్బంది

ఆదోని రూరల్: సబ్సిడీ వేరుశనగలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి పాపిరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేరుశనగ కిలో పూర్తి ధర రూ.93 కాగా, రూ.37.20 సబ్సిడీ పోనూ రైతు రూ.55.80 చెల్లించాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కందులు, జీలుగ విత్తనాలు కూడా రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మోడల్ స్కూల్‌లో చేర్పించండి


కోసిగి హిందూగర్ల్స్ హెచ్‌ఎం సంజన్నకు కరపత్రం అందజేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

కోసిగి: ఇంగ్లిష్ మీడియంలో పట్టు ఉండి ఆసక్తి కలిగిన విద్యార్థులను 6వ తరగతిలో కోసిగి ఏపీ మోడల్ స్కూల్‌లో చేర్పించాలని ఆ పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీప్రవీణ, సాయికుమారి, రాజేశ్వరి, గోపి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలను కలిసి కరపత్రాలు అందజేశారు. ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేయించాలని హెచ్‌ఎంలను కోరారు. కార్యక్రమంలో హిందూగర్ల్స్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంజన్న తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలకు ఎంపిక


అనిత (ఇంటర్)


హేమలత


శైలజ


హర్షిత్


మనిమేఘశ్యాం

కోసిగి: 2023–2024 విద్యా సంవత్సరం గురుకుల పాఠశాలలకు కోసిగి నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కోసిగిలోని చౌడేశ్వరి పాఠశాలలో 4వ తరగతి చదువుతూ 5వ తరగతి ఏపీ గురుకుల పాఠశాలకు ప్రవేశ పరీక్ష రాశారు. ఇందులో కోడి అనిత ఇంటర్ మొదట సంవత్సరానికి కోవెలకుంట్ల గురుకుల స్కూల్‌కు, హర్షిత సి.బెళగల్ గురుకుల స్కూల్‌కు, హేమలత, శైలజలు పత్తికొండ బాలికల గురుకుల స్కూల్, మనిమేఘశ్యామ్ బేతంచర్ల పాఠశాలకు ఎంపికయ్యారు.

ఎమ్మిగనూరులో కుక్కల వీరంగం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం 11 మంది కుక్క కాటుకు గురికాగా, మరో ముగ్గురు గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. చిన్న పిల్లలను రోడ్డు మీదకు పంపాలంటేనే భయపడుతున్నారు. పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన సరస్వతి(12 సం), సంధ్య(6), పుష్పావతి(12), లక్ష్మీపేట షరీఫ్(36), ముగతిపేటకు చెందిన మల్లికార్జున(12), శాంతినగర్‌కు చెందిన విజయకుమారి(32), టీబీపీ కాలనీకి చెందిన రాజు(25), మహబుబ్‌నగర్‌కు చెందిన వీరేష్(6), కలుగోట్ల రోడ్డుకు చెందిన సోహెల్(20), 12వ వార్డుకు చెందిన హర్షవర్ధన్(18), కిషోర్‌లు కుక్కగాటుకు గురి అయ్యారు. అలాగే ఎమ్మిగనూరు మండలం కడిమెట్లకు చెదిన కవిత(13), బిందులత(12), మల్కాపురంకు చెందిన అంథోనమ్మ(63)లు కుక్క కాటుకు గురయ్యారు. సోమవారం ఒక్క రోజే పట్టణంలో ప్రాంతాలకు చెందిన 22 మంది కుక్క కాటుకు గురైనట్లు ప్రభుత్వాసుపత్రి సిబ్బంది తెలిపారు.